సేవాభాగ్యం అందరికీ లభించదు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేత

అవనిగడ్డ: ప్రజలకు సేవ చేసే భాగ్యం అందరికీ లభించదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు సేవ చేసే అవకాశం కల్పించారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో ఆదివారం అవనిగడ్డ మండల పరిధిలోని వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశ మయ్యాయని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారు జామునే పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి తలుపు తట్టి పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లను తమ కన్నబిడ్డల కంటే బాగా చూసుకుంటున్నారని వృద్ధులు, వికలాంగులు ప్రశంసిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వలంటీర్లు అందిస్తున్న సేవల వల్లే మేము ప్రజల దగ్గరకు ధైర్యంగా వెళుతున్నామని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వ సమయంలో ఉన్న బడ్జెట్‌నే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, ఇన్ని సంక్షేమ పథకాలు చంద్రబాబు అప్పుడెందుకు అమలు చేయలేదని ఎమ్మెల్యే సింహాద్రి ప్రశ్నించారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే వలంటీర్లకు సూచించారు.


సేవారత్న, సేవామిత్ర పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వికాస్‌బాబు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు

ప్రతిపక్షం అంటే ప్రజల మధ్య ఉండాలి..

ప్రతిపక్షంలో ఉన్న నాయకులు నిత్యం ప్రజల మధ్యన ఉండాలని, ప్రజల వాస్తవ ఇబ్బందులు, సమస్యలపై పోరాడి వారికి అండగా ఉండాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గతంలో తాను రెండుసార్లు ఓడిపోయినా నిత్యం ప్రజల మధ్యే ఉన్నానని గుర్తు చేశారు.

ప్రజారాజ్యం పార్టీలో ఉన్నప్పుడు వరదల సమయంలో రాత్రి, పగలు అధికారులను అప్రమత్తం చేసి, కరకట్టల వెంట తిరిగి ప్రజలకు ధైర్యం చెప్పామని, ఆనాటి ఆర్డీఓ కట్టా హైమా వతి ప్రభుత్వంతో పాటు పీఆర్‌పీ పోటీపడి సేవలందించారని రికార్డులో రాసి వెళ్లారని గుర్తు చేశారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వంపై, తనపై బురద జల్లడమే ధ్యేయంగా పెట్టుకున్నారని అన్నారు. కోడూరు మండలంలోని తీర గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం పూట కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తుంటే ఆయన సాయంత్రం వేళ ఆ గ్రామాలకు వెళ్లి గోతుల్లో మురుగునీటిని చూపించి విషప్రచారం చేశారన్నారు. ఈ సందర్భంగా ఐదుగురు వలంటీర్లకు సేవారత్న పురస్కారాలతో పాటు మరికొందరికి సేవామిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే సింహాద్రి అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వలంటీర్లు క్షీరాభిషేకం చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, వైఎస్సార్‌సీపీ యువనేత సింహాద్రి వికాస్, ఎంపీపీ తుంగల సుమతీదేవి,జెడ్పీటీసీ చింతలపూడిల లక్ష్మీ నారాయణ, సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, లక్ష్మీ తిరుపతమ్మ, సనకా సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాబు, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



పెడన: 21వ వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు ఆధ్వర్యంలో గూడూరు రోడ్డులోని రైలు గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ప్రయాణికులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సతీష్‌బాబు మాట్లాడుతూ తన తల్లి అన్నపూర్ణ పేరుతో ఏర్పాటుచేసిన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, యర్రా టార్జాన్, హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బర్రంకుల ఉరువులమ్మ జాతర



గణపేశ్వరం(నాగాయలంక): మండలంలోని గణపేశ్వరం శివారు బర్రంకుల గ్రామ దేవత ఉరువులమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం కోలాహలంగా జరిగింది. శనివారం రాత్రంతా అమ్మవారికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు బిందెలతో పసు పు, కుంకుమ నీళ్ల వారబోసారు. ఆలయ కమి టీ నేతృత్వంలో జాతర సంప్రదాయాలకు అ నుగుణంగా డప్పు వాయిద్యాలు, నృత్యాలతో వీధుల వెంట సందడి చేశారు. ఆదివారం ఉద యం ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజ లు చేసి భక్తులు, గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. గోపాళం వెంకటేశ్వరరావు (బా బు), చంద్రశేఖర్, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా యల్లారమ్మ జాతర



నాగాయలంక: స్థానిక సబ్బినేని బజారులోని సబ్బినేని వారి కులదేవత యల్లారమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సబ్బినేని వంశీయుల నేతృత్వంలో జల్ది లోంచి తరలించి శనివారం రాత్రంతా అమ్మవారి ఘటాలు, ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముగిసి ఘటాలు గుడికి చేరుకున్నాక ఆదివారం జాతర సంప్రదాయాల ప్రకారం గుడి సంబరం నిర్వహించారు. భక్తులు చద్ది నైవేద్యాల సమర్పణతో మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ జరిగింది. ఉప సర్పంచి తలశిల వెంకట నరసింహారావు (నాని), ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం మత్తి హరిశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఫౌండేషన చైర్మన్ మత్తి వెంకటేశ్వరరావు భక్తులకు మజ్జిగ అందజేశారు. కామిశెట్టి శ్రీనివాసరావు, సాయి తేజ, కాంతారావు, బి. వెంకట రమణ పాల్గొన్నారు.









బందరుకు పండగొచ్చింది

- నేడు పోర్టు పనుల ప్రారంభానికి సీఎం జగన్ రాక
- పెద్ద ఎత్తున స్వాగత బ్యానర్ల ఏర్పాటు



పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన బ్యానర్లు



విద్యుత్ దీపాలతో ముస్తాబైన కోనేరు సెంటర్



మచిలీపట్నంటౌన్: బందరు ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన పోర్టు పనుల ప్రారంభానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వస్తుండటంతో నగరమంతా పండుగ వాతావరణం నెలకొంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ.. వైఎస్సార్ సీపీ శ్రేణులు నగరంలోని అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున స్వాగత బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేశారు. వాహనాలకు పార్టీ జెండాలు కట్టుకుని ఉత్సాహంగా కలియ తిరుగుతుండటంతో సందడి వాతావరణం నెలకొంది. ప్రధాన కూడళ్లలో ఉన్న పలువురి విగ్రహాల సర్కిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు పార్టీ జెండాలతో కూడిన తోరణాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. నగరంలో ఎటుచూసినా స్వాగత బ్యానర్లు, పార్టీ జెండాలు దర్శనమిస్తున్నాయి. హెలీప్యాడ్ ఏర్పాటు చేసిన పోలీస్ పరేడ్ గ్రౌండ్ బయట పార్టీ నాయకులు పెద్దఎత్తున స్వాగత బ్యానర్లను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు నగరంలోని కోనేరు సెంటర్‌తో పాటు ప్రధాన రహదారిలోని అన్ని హోర్డింగ్‌లపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ భారీ బ్యానర్లు ఏర్పాటు చేశారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కళకళలాడింది. ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూలైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.4 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేత



అవనిగడ్డ: అవనిగడ్డకు చెందిన పోతరాజు సత్యకుమార్‌కు రూ.4 లక్షల విలువగల సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌ఓసీని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎల్‌ఓసీ ధ్రువీకరణ పత్రాన్ని సత్యకుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. హైదరాబాద్ సిటీ న్యూరో సెంటర్‌లో సత్యకుమార్‌కు ఆపరేషన్ జరగాల్సి ఉండగా రూ.4 లక్షలు అవసరం అవుతాయని వైద్యులు అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్యారమ్స్‌లో శిక్షణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా పలు అంశాలపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో 14 రోజులు విద్యార్థులకు క్యారమ్స్, చెస్, మ్యూజికల్ చైర్స్, లూడో తదితర ఆటలు ఆడించారు. యోగా, ధ్యానం చేయించారు. పుస్తకాలు చదివించి కథలు చెప్పారు. కార్యక్రమాలను ఉప గ్రంథాలయ అధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

అపూర్వం.. ఆత్మీయ కలయిక



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1997–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాలలో ఆదివారం జరిగింది. ఆనాటి అధ్యాపకులు పీఆర్‌కే ప్రసాద్, ముమ్మారెడ్డి రామారావు, ఎ. కోటేశ్వరరావు, వై. అజయ్, రిటైర్డ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భోగాది సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ. వీరకుమారి, బంటుమిల్లి డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూరగం జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి రూ. 10వేలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుడ్డు సుబ్బారావు, ఎ. వెంకటేశ్వరరావు, ఫణి, సుబ్బారావు, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వామి వారి పవళింపు సేవ



టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లిలోని బాల పార్వతి సమేత రామేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం రాత్రి పవళింపు సేవతో ముగిశాయి. ఈనెల 17 నుంచి స్వామి వారి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యడవల్లి నీల లోహిత శాస్త్రి ఆధ్వర్యంలో రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి బ్రహ్మత్వంలో ధ్వజారోహణం, పండిత సత్కారం ఘనంగా జరిగింది. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

పెదప్రోలు(మోపిదేవి): యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్ బాబు అన్నారు. పెదప్రోలులో కృష్ణా, గుంటూరు జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ఇతర వ్యాపకాలకు పోకుండా యువతకు క్రికెట్ పోటీలు ఏర్పాటుచేసిన నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు యన్నం హరి మాట్లాడుతూ వేసవిలో 40 రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి 15 వేలతో పాటు ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇస్తామని, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఉంటుందని వివరించారు. స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, మేళ్లమర్తిలంక చైర్‌పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ, మాజీ చైర్ పర్సన్ కామిశెట్టి వెంకట సురేష్ బాబు, యన్నం నరేష్, కైలా సుబ్రహ్మణ్యం (కన్న), లింగం జగదీష్‌కుమార్, కత్తుల శ్రీనివాసరావు, గొరిపర్తి రవికాంత్, గ్రామ కన్వీనర్ రాయన సత్యనారాయణ పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక పడమర వైపు యువతకు అవనిగడ్డకు చెందిన శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు క్రికెట్ కిట్ బహూకరించారు. ఆదివారం స్థానిక తాళ్ల రామాలయం వద్ద యువకులకు ఈ కిట్ అందజేశారు. యువత క్రీడల్లో రాణించాలని, జాతీయ స్థాయికి వెళితే ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పఠాన్ కరిముల్లా ఖాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



చల్లపల్లి: స్థానిక ఎస్‌ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మేకా సాయి తరుణ్ మెమోరియల్ ట్రస్ట్, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జీవన్, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ కుమార్‌లు 150 మందికి ఉచితంగా ఈసీజీ, 2డీ ఎకో, షుగర్, బీపీ, ఈఎన్‌టీ, నేత్ర పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. శిబిరాన్ని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు, డాక్టర్ మాలెంపాటి శారద, ట్రస్ట్ ప్రతినిధులు మేకా మధుబిందు, మనోజ్, బండి సాయిబాబు, లీలావతి, బీడీఆర్ ప్రసాద్ పర్యవేక్షించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతకు బహుమతి అందజేస్తున్న సలీమ్

గూడూరు: గూడూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న వివిధ పోటీల విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. గత వారం రోజులుగా నిర్వహించిన చెస్, లుడో, క్యారమ్స్, చిత్రలేఖనం పోటీల విజేతలకు గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యుడు అబ్దుల్ సలీమ్‌బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజు స్వామి జాతర

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో పోతురాజు స్వామివారి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి శిలలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ మహిళలు స్వామి వారికి నైవేద్యాలు సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. యువకులు వీరతాడు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంవద్ద రెండు వేలమందికి అన్నసమారాధన నిర్వహించారు. నక్కవానిదారి, మందపాకల, కోడూరు గ్రామాలకు చెందిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికురాలికి గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికురాలికి గాయాలయ్యాయి. పెనమలూరు సీఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పామర్రు మండలం కనుమూరు గ్రామానికి చెందిన కొడాలి సువార్తమ్మ దిలీప్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తోంది. ఆమె కానూరు వద్ద విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు పనులు చేసి రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె భుజం, చేతికి గాయాలయ్యాయి. బాధితురాలిని పోరంకిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.





















సేవలకు సత్కారం

- గ్రామ వలంటీర్లకు పురస్కారాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- పామర్రు నియోజకవర్గంలో 1141 మందికి అవార్డులు

పామర్రు: సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే సర్కారు సేవలను తీసుకువచ్చారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా గ్రామాల్లోని వేలాది మందికి ఉపాధి కల్పించారు. ఈ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోని ప్రజలకు సైతం మెరుగైన సేవలు అందుతున్నాయి. ఉత్తమ సేవలందించిన వలంటీర్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పురస్కారాలను ప్రకటించింది. బయో మెట్రిక్ చేయటం నుంచి పింఛన్లు పంపిణీ, వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చటం, ఇతర అంశాల ఆధారంగా పురస్కారాలకు ఎంపిక చేశారు. నియోజకవర్గ స్థాయిలో వీరిని సత్కరించి అవార్డులను అందజేయనున్నారు.

పామర్రు నియోజకవర్గంలో 1,141 మందికి..

పామర్రు నియోజకవర్గంలో 1,369 మంది వలంటీర్లలో 1,141 మందికి అవార్డులు దక్కాయి. వీరిలో 1111 మందికి సేవా మిత్ర, 25 మందికి సేవా రత్న, ఐదుగురికి సేవా వజ్ర అవార్డులు లభించాయి. వరుసగా మూడో సంవత్సరం అవార్డులు ప్రకటించడం పట్ల వలంటీర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాము అందిస్తున్న సేవలకు గుర్తింపు లభించిందని పలువురు వలంటీర్లు పేర్కొన్నారు. కొత్తగా చేరిన వారితోపాటు సాంకేతిక అంశాల్లో వెనుకబడిన 258 మందికి అవార్డులు వర్తించలేదు.

83 శాతం మందికి..

పామర్రు నియోజకవర్గంలో పనిచేస్తున్న 83 శాతం మంది వలంటీర్లకు ప్రభుత్వ సేవ మిత్ర, రత్న, వజ్ర అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది.


పామర్రులోని సచివాలయం-1 భవనం

కేటగిరీలు ఇలా..

2022–23 సంవత్సరంలో ఎనిమిది కేటగిరిల్లో విశిష్ట సేవలు అందించిన వలంటీర్లకు పురస్కారాలుగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. సేవా మిత్రలకు రూ.10 వేలు, సేవా రత్నలకు రూ.20 వేలు, సేవా వజ్రలకు రూ.30 వేలు చొప్పున నగదు పుసరస్కారాలు, సర్టిఫికెట్, బ్యాడ్జి, శాలువ, మెడల్ అందించనున్నారు. ఈ పురస్కారాలను లాంఛనంగా ఈనెల 19వ తేదీన సీఎంజగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈనేలాఖరు వరకు ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు అందించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఎంపీడీవోలు చేస్తున్నారు.

మండలాల వారీగా అవార్డులు పొందిన వలంటీర్లు

మండలం	వలంటీర్లు	సేవా మిత్ర	సేవా రత్న	సేవా వజ్ర
పామర్రు	301	264	5	0
పెదపారుపూడి	187	156	5	0
మొవ్వ	326	266	5	1
పమిడిముక్కల	320	226	5	2
తోట్లవల్లూరు	235	199	5	2
మొత్తం	1369	1111	25	5

సేవలకు గుర్తింపు



నేను అందిస్తున్న సేవలకు సేవా వజ్ర అవార్డుతో గుర్తింపు లభించింది. గతేడాది అవార్డు రాకపోవడంతో నాలో పట్టుదల పెరిగింది. క్షేత్ర స్థాయిలో చేస్తున్న సేవలన్నీ సకాలంలో అందించాలన్న ఆలోచన వచ్చింది. ఈ సంవత్సరం అన్ని సేవలు సంతృప్తికరంగా అందించా. దీంతో సేవా వజ్ర అవార్డుకు ఎంపిక చేశారు.

–బోలెం నాగరాజి, సేవ వజ్ర గ్రహీత, మొవ్వ మండలం

నేడు ఎమ్మెల్యే పర్యటన

మంత్రిపాలెం(మొవ్వ): మండలంలోని మంత్రిపాలెం పంచాయతీ పరిధిలోని సూరసానివారిపల్లిలో సోమవారం పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పర్యటించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు తెలిపారు. తొలుత నిడుమోలు–కూచిపూడి రోడ్డు నుంచి సూరసారిపల్లి వరకు జిల్లా పరిషత్ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో మధ్యాహ్నం పాల్గొంటారు. అనంతరం అదే గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని వెల్లడించారు.

వజ్ర అవార్డు సాధిస్తా..



విధి నిర్వహణలో నా సేవలను గుర్తించిన ప్రభుత్వం గతేడాది సేవా మిత్ర అవార్డుతో సత్కరించింది.ఈ సంవత్సరం సేవారత్న అవార్డుకు ఎంపిక కావడం సంతోషాన్ని ఇచ్చింది. 2023–24లోసేవా వజ్ర అవార్డు సాధించాలన్నది లక్ష్యం. అందుకు అనువుగా ప్రజలకు విశేష సేవలు అందిస్తాను.

–ఎస్‌కోటి ప్రసాద్, సేవా రత్న అవార్డు గ్రహీత, పామర్రు–4 సచివాలయం

బాధ్యత పెరిగింది



వార్డులో ప్రజలకు వలంటీర్‌గా అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించింది. సేవా మిత్ర అవార్డు ప్రకటించడం ఆనందాన్ని ఇచ్చింది. దీంతో వలంటీర్‌గా నాపై మరింత బాధ్యత పెరిగింది. ప్రభుత్వ గుర్తింపుతో పాటు సేవలు అందుకుంటున్న ప్రజల మన్ననలు సంతోషాన్ని ఇస్తున్నాయి.

–ఆర్‌జీవీ రామ్, సేవా మిత్ర అవార్డు గ్రహీత

గ్రంథాలయంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


అలరించిన చిన్నారి పూర్ణతేజస్వీ నృత్య ప్రదర్శన


గుడ్లవల్లేరులో గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి (పామర్రు): విద్యార్థులు కళల పట్ల ఆదరణ కలిగి ఉండాలని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖ గ్రంథాలయంలో ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నారి బి.పూర్ణ తేజస్వీ కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఎస్.భావనశ్రీ, పీ జశోధలు సినీ గేయాలకు నృత్యాలు చేశారు. మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి, గ్రామ ప్రముఖులు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పామర్రులో ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు సామెతలు, పద్యాలు నేర్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- **మండవల్లి:** మండవల్లి గ్రంథాలయంలో పర్యావరణంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ఆధ్వర్యంలో తొలుత పర్యావరణంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చిత్రలేఖన పోటీల్లో చెట్లు, పర్వతాలు, అడవులు, ఎడారులు వంటి పలు చిత్రాలను రంగులతో అందంగా వేయడంపై చిత్రలేఖన ఉపాధ్యాయుడు భాస్కరరావు విద్యార్థులను, పోటీలను నిర్వహించిన పర్వీనను అభినందించారు.
- **పెదపారుపూడి:** స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు శారీరక క్రమ శిక్షణపై అవగహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ఇచ్చి చదివించారు. గ్రంథాలయాధికారి ఎంవి.ఎస్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: వేసవి శెలవుల్లో బాల బాలికల ఆటపాటలతో గ్రంథాలయాలు సందడిగా మారాయి. ఆదివారం అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలతో పాటు ఆటల పోటీలను నిర్వహించారు. విజ్ఞాన శిబిరాల పేరుతో వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బాల బాలికలు చక్కగా వినియోగించుకుంటున్నారని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పెనమలూరు: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్చరీ కోచ్ చెరుకూరి సత్యనారాయణ అన్నారు. తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైటాథన్ వాక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి తాడిగడప సెంటర్ వరకు వాక్ నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసూయ కపూర్ మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. తాము రెటినోబ్లాస్టోమాకు అత్యాధునిక చికిత్స అందిస్తామని చెప్పారు. ఈ వాక్‌లో దాదాపు 500 మంది పాల్గొన్నారు.


వాలీబాల్ కిట్ అందజేత

పెనమలూరు: గంగూరులో క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌ను వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బంగారు నాగేంద్రబాబు ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యస నాలకు గురికాకుండా క్రీడల్లో రాణించాలన్నారు.

రోగిపై వైద్యుడి దౌర్జన్యం

అవనిగడ్డ: వైద్యం కోసం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వెళ్లిన దివ్యాంగ పేషెంట్‌పై వైద్యుడు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయ అధికారిగా పనిచేస్తున్న దివ్యాంగుడు జుజ్జువరపు ప్రభుదాస్ షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి నెలా స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వెళ్లి డాక్టర్‌కు చూపించుకుని మందులు వాడుతుంటారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 11.40 గంటల సమయంలో వైద్యశాలకు వెళ్లి డాక్టర్ సూర్యతేజ వద్ద చూపించుకున్నారు. వివరాలు చెబుతూ తాను షుగర్‌కు మెట్‌ఫామినిన్ ట్యాబ్లెట్స్ వాడుతున్నానని చెప్పాడు. దీనితో ఆగ్రహించిన డాక్టర్ నువ్వు చెప్పిన మందులు ఇవ్వాలా, ఏ మందులు ఇవ్వాలో నువ్వే చెబితే డాక్టర్‌ని నేనెందుకు అంటూ పరుష పదజాలంతో దూషించాడు. ఏ మందులు వాడుతున్నామో చెబితే తప్పెలా అవుతుందని ప్రభుదాస్ ప్రశ్నించగా డాక్టర్‌ని నాకే ఎదురు చెబుతావా అంటూ కుర్చీలో నుంచి లేచి చేయి చేసుకోవడంతో పాటు బలంగా తోసివేశాడు. బాధితుడు ఈ విషయాన్ని ఆస్పత్రి ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి ఉన్నతాధికారి డాక్టర్ సూర్యతేజను పిలిపించి మందలించారు.

పేదలకు ఉచితంగా కల్యాణ మండపం



గుడ్లవల్లేరు: పేదల శుభ కార్యక్రమాలకు అవసరమైన కల్యాణ మండపాన్ని మాజీ డీఎస్పీ శాయన సుశీలరావు ఆర్థిక సాయంతో నిర్మించటం అభినందనీయమని పీఏసీఎస్ అధ్యక్షుడు శాయన కుటుంబరావు అన్నారు. ఆదివారం విన్నకోటలో శాయన వీరభద్రయ్య, వీర రాఘవమ్మ సేవా సమితి పేరిట నిర్మించిన కల్యాణ మండపాన్ని కుటుంబరావు ప్రారంభించారు. పేదలకు ఉచితంగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పీఏసీఎస్ కార్యదర్శి నాగ మల్లేశ్వరరావు, పాల సంఘాధ్యక్షుడు శాయన హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులో నిర్మిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం నిర్మాణానికి దాతలు ఇతోధికంగా విరాళాలు అందిస్తున్నారు. భవన నిర్మాణానికి బాణాల నరసింహారావు రూ.50 వేలు, కూరెళ్ల సుబ్బాచారి రూ.25 వేలు విరాళాన్ని మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావుకు ఆదివారం అందించారు. వీరితో పాటుగా పరమేశ్వర ఏజెన్సీస్ అధినేత కొండేటి భాస్కర్ మావనత భవన నిర్మాణానికి 100 సిమెంట్ బస్తాలను విరాళంగా అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ నూతన అధ్యక్షుడిగా కూరెళ్ల సుబ్బాచారి ఎన్నికయ్యారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో ఆదివారం జరిగిన మానవత సమావేశంలో 2023–24 సంవత్సరానికి గానూ నూతన కార్యవర్గ ఎన్నికను జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా కూరెళ్ల సుబ్బాచారి, ప్రధాన కార్యదర్శిగా కల్లేపల్లి నారాయణరావు, కోశాధికారిగా పాత్రోలు గణేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా దయాల ప్రభాకరరావు, సంయుక్త కార్యదర్శిగా గంటా ఇందిరాదేవిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా గూడపాటి జయరామచంద్రరావు, రేవిణిశెట్టి సూర్యనారాయణ, కన్నిగంటి వెంకట సుబ్బారావు, గోళ్ల మల్లికార్జునరావు ఎన్నికయ్యారు.

నైతిక విలువలు పెంపొందాలి

ఉయ్యూరు: విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు పెంపొందించుకోవాలని రిసోర్సుపర్సన్ ఎస్.వీ.అశోక్ అన్నారు. ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం నైతిక విలువలపై సదస్సు నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ నైతిక విలువలతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమన్నారు. దేశ నేతల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

బాటసారులకు మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం జనార్దనపురం గ్రామంలోని శ్రీ నరసింహ పుట్టలాంబ కార్పొరేషన్, కోటీ గ్రూప్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నెల రోజులుగా కొనసాగుతోంది. ఆదివారం పంపిణీ కార్యక్రమాన్ని కఠారి రామ్‌కుమార్ ప్రారంభించారు. జనార్దనపురం గ్రామానికి చెందిన సరిపల్లి నర్సారెడ్డి, మల్లేశ్వరి, సరిపల్లి కోటిరెడ్డి, భవశ్రీజ, సహిత్‌రెడ్డి, గమన్‌రెడ్డి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వర్షాలు కురిసే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వైస్ ఎంపీపీ పూడి సుధాకరరావు, సుంకర ప్రసాదు, ఉదయ్‌కుమార్, కఠారి గోవింద్, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి వితరణ



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం (పెద్దశివాలయం) అభివృద్ధి పనులకు భక్తులు వితరణ ఇచ్చారు. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం ఆదివారం వివరాలు తెలిపారు. పట్టణానికి చెందిన గూడపాటి బాబ్జీ తన తల్లిదండ్రులు గూడపాటి బాబూరావు, నందేశ్వరమ్మ సోదరుడు దుర్గాప్రసాద్ జ్ఞాపకార్థం రూ.10,116 వితరణగా అందజేశారని వివరించారు. నగదు ఇచ్చిన బాబ్జీని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరి రాంబాబు, కమిటీ సభ్యులు టీఎస్‌వీ సాంబశివ రావు, జోగా సూర్యప్రకాశరావు, జ్యోతుల శ్రీనివాసరావు, పీఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ఆర్. శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

లయన్స్‌క్లబ్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా వైవీ

గుడివాడ టౌన్: గుడివాడ లయన్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షుడు వైవీ కృష్ణారావు జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా గవర్నర్ జె.శంకర్‌గుప్తా నూతన క్యాబినెట్‌లో నియమించినట్టు తనకు ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. తనకు ఇచ్చిన ఈ బాధ్యతను లయన్స్‌క్లబ్ ప్రతిష్ఠ పెంపొందించేలా సేవలందిస్తానని కృష్ణారావు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ




తోట్లవల్లూరు: అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంకలో గోరిపర్తి సుబ్బయ్య, గోరిపర్తి కృష్ణకు చెందిన రెండు పూరిళ్లు గ్యాస్ లీకేజి కారణంగా దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3,500 నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు భీమవరపు శ్రీలక్ష్మి, వార్డు సభ్యుడు పొనమాల వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

4,343 మందికి 'ఉపాధి'

పామర్రు: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 4,343 మంది ఉపాధి హామీ పథకం కింద కూలీలు పనులను నిర్వహిస్తున్నారని ఏపీవో పొలు రాజు తెలిపారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించామన్నారు. చెరువు కట్టల అభివృద్ధి, పంట బోదెల తవ్వకం తదితర పనులను నిర్వహిస్తున్నామన్నారు. అడ్డాడ గ్రామంలోని అభివృద్ధి పనులు 90 కూలీలు చేస్తున్నారని తెలిపారు. వేసవి దృష్ట్యా పని ప్రాంతంలో కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డు అసిస్టెంట్, మేట్లు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి అధికంగా ఉంది. సెలవు దినం కావడం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్త జన సందడితో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్ర నుంచే కాక తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యలో వాహనాల్లో భక్తులు తరలివచ్చారు.

మోడల్ గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

- గంపలగూడెం మండలంలో ఆరు గ్రామాల్లో సర్వే
- 8,935 హద్దు రాళ్ల ఏర్పాటు



గంపలగూడెంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్షలో భాగంగా మొదటి విడత భూ రీసర్వేలో మండలంలో మోడల్ గ్రామాలుగా ఎంపికైన ఆరు గ్రామాల్లో భూ రీసర్వేను రెవెన్యూ అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఫేజ్–1లో జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 14 గ్రామాల్లో గంపలగూడెం మండలంలో కనుమూరు, అనుముల్లంక, వినగడప, గంపలగూడెం, చెన్నవరం, రాజవరం గ్రామాలను ఉన్నతాధికారులు ఎంపిక చేసి, గత ఏడాది రీ సర్వేను చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన సర్వే రెవెన్యూ సిబ్బందికి అనేక సమస్యలు ఎదురైనప్పటికీ పాఠాలు నేర్చుకుంటూ సర్వేను విజయవంతంగా పూర్తిచేశారు. దీర్ఘకాలం తర్వాత చేపట్టిన సర్వే అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఆర్ఐ, మండల సర్వేయర్, గ్రామ సచివాలయాల సర్వేయర్లు సర్వేలో ప్రధాన పాత్ర పోషించారు.

ఆరు గ్రామాల్లో సర్వే వివరాలు..

గంపలగూడెం మండలంలోని ఆరు రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి కావడంతో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివరాలను అధికారులు వెల్లడించారు. కనుమూరులో పట్టాభూమి 3,381.08 ఎకరాలు, ప్రభుత్వ భూమి 456.87ఎకరాలు, అనుముల్లంకలో పట్టాభూమి 1,832.15 ఎకరాలు, ప్రభుత్వ భూమి 324.85 ఎకరాలు, వినగడపలో పట్టాభూమి 2,459.59 ఎకరాలు, ప్రభుత్వ భూమి 796.81ఎకరాలు, గంపలగూడెంలో పట్టా భూమి 2,120 ఎకరాలు, ప్రభుత్వ భూమి 478 ఎకరాలు, చెన్నవరంలో పట్టాభూమి 869.98 ఎకరాలు, ప్రభుత్వ భూమి 179.81 ఎకరాలు, రాజవరంలో పట్టాభూమి 730.48 ఎకరాలు, ప్రభుత్వ భూమి 82.48 ఎకరాలుగా లెక్కకు వచ్చింది. ఆయా గ్రామాల్లో పట్టా, ప్రభుత్వ భూములకు 8,935 సరిహద్దు రాళ్లను పాతించారు.

భూహక్కు పత్రాల పంపిణీ

మండలంలోని ఆరు గ్రామాల్లో సర్వేకు సంబంధించి రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ కూడా పూర్తిగా చేపట్టారు. రాజవరంలో 324 పుస్తకాలకుగాను 288, చెన్నవరంలో 393 పుస్తకాలకు గాను 306, గంపలగూడెంలో 880 పుస్తకాలకు గాను 738 పుస్తకాలు, వినగడపలో 1,277 పుస్తకాలకు గాను 1,119, అనుముల్లంకలో 631 పుస్తకాలకు గాను 600, కనుమూరులో 1,366 పుస్తకాలకుగాను 1,197 పుస్తకాలను రైతులకు అందజేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు.

సర్వేతో ఎంతో ప్రయోజనం



జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షలో భాగంగా చేపట్టిన భూ రీసర్వే రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉంది. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు శాశ్వత పరిష్కారానికి నోచుకుంటున్నాయి. రైతుకు ఉచితంగా భూ హక్కు పత్రాలతో పాటు భూమికి సరిహద్దు రాళ్లను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ భూమి కూడా పూర్తిగా స్వాధీనంలోకి వస్తుంది.

– తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, గంపలగూడెం

సీఎం సహకారంతో పట్టణాభివృద్ధి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు చెప్పారు. నందిగామ 17వ వార్డులో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా జరగని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో చేసి చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వాల పాలనలో కనీస మౌలిక వసతులకు నోచుకోక పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి..

నందిగామలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణ ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు గుర్తు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు.

అండగా ఉండి ఆశీర్వదించాలి..

మంచి చేయాలనే తపనతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని జగన్‌మోహనరావు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జయరాం, కౌన్సిలర్ బాపట్ల సాంబయ్య, వార్డు కన్వీనర్ పట్టా శ్రీను, నాయకులు తానూరి రాము, బండారు వెంకట్రావు, విశ్వనాథపల్లి కృపారావు, మేచర్ల విజయలక్ష్మి, పోతురాజు, బండారు శేషు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



కంచికచర్ల గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెబుతున్న ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు కనకారావు

పెనుగంచిప్రోలు: గ్రంథాలయాలను వినియోగించుకోవాలని అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం బాలబాలికలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. నీతి కథలు చదివించడం, పుస్తక పఠనంతో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

కంచికచర్ల: వేసవిలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండటానికి ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ తెలుగు భాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు విద్యార్థులకు కథలు నేర్పించారు. కవి నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పించారు.

సమస్యల పరిష్కారానికి.. నేడు స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ శంకర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో సమస్యలుంటే వాటి పరిష్కారానికి ప్రజలు అర్జీలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తారని తహసీల్దార్ పేర్కొన్నారు.

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నందిగామలో ఈదురుగాలులు



ఈదురు గాలులకు రాఘవాపురం వెళ్లే రహదారిలో విరిగిపడిన చెట్టు

నందిగామ: నందిగామలో శనివారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. రాత్రి వేళ ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో పలుచోట్ల చెట్టు కొమ్మలు విరిగిపోయాయి. అదే సమయంలో మండలంలోని రాఘవాపురం వెళ్లే దారిలో ఓ వృక్షం విరిగి రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయా యి. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ లైన్లు తెగి పోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రాత్రి వేళలో సైతం విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమించి మరమ్మతులు నిర్వహించి తెల్లవారుజాముకు అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు

నందిగామ: పట్టణంలోని కృష్ణ బలిజనగర్‌లో శివ నాగేంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం



నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: తాగునీటి సమస్య పరిష్కరిస్తామని మునిసిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ చెప్పారు. పట్టణంలోని 25వ వార్డు క్రిస్టియన్ పేటలో కొన్ని ప్రాంతాల్లో మునిసిపాలిటీ కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగునీరు మురికిగా, దుర్వాసనతో వస్తోంది. దీంతో స్థానిక మహిళలు ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన పంపులు వచ్చే సమయానికి వెళ్లి నీటిని స్వయంగా పరిశీలించారు. నీరు మురికిగా రావడం, వాసన వస్తుండటంతో ఆయన వెంటనే మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు, ఏఈ హనుమంతరావుకు ఫోన్ ద్వారా తెలిపారు. సోమవారం సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అన్న సంతర్పణ సమితి సేవలు అభినందనీయం



చిన్నారికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఇంతియాజ్ అహ్మద్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అన్న సంతర్పణ సమితి సేవలు అభినందనీయమని ఏపీ మైనార్టీ సంక్షేమశాఖ స్పెషల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. పేదలకు అన్నదానం మహాదానమన్నారు. సమాజంలో ఆకలిగా ఉన్న పేదవారికి అన్నదానం చేయటం అద్భుతమైన కార్యక్రమమని కొనియాడారు. ప్రతి రోజూ అన్నదానం చేయటం సామాన్యమైన విషయం కాదన్నారు. ఆకలిగా ఉన్న వ్యక్తులు ఎక్కడ ఉంటారో అక్కడకు వెళ్లి ప్రత్యేకంగా ఆహారాన్ని అందించటం వెనుక చాలా కృషి ఉందన్నారు. తాను ఈ జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలోనూ మంచి సేవలందించిందని గుర్తు చేశారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

తిరుపతమ్మ ఆలయ ఈఓ రమేష్‌నాయుడు



పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ ఆలయ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు అన్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఆలయం వద్ద, మునేరు అవతల మామిడి తోటల్లో సుమారుగా రూ.13.5 కోట్ల వ్యయ అంచనాతో కేశ ఖండనశాల, టాయిలెట్ బ్లాక్, డార్మెటరీ, షెడ్లు, గదుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, వాటిని ఐదారు నెలల్లో పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. భక్తులను ఆకర్షించడానికి జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద భక్తుల విరాళాలతో స్వాగత ద్వారం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అక్కడ రెండు వైపులా వాహనాలు వెళ్లేందుకు డివైడర్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి ఆర్‌అండ్‌బి అధికారుల అనుమతి కోరామని, వారు కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆలయ సత్రాల గదుల్లో వసతులు సక్రమంగా లేవని, ఏసీ గదుల నిర్వహణ కూడా సక్రమంగా లేదని ఈఓ దృష్టికి తీసుకెళ్లగా ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడామని, కొద్ది రోజుల్లో వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. భక్తుల వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమివ్వనున్నట్లు తెలిపారు.

చలివేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు



చలివేంద్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ప్రజల సౌకర్యార్థం పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చలివేంద్రాలను ఏర్పాటుచేసి నిర్వహించడం అభినందనీయమని, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం పురపాలక సంఘ పరిధిలో పలు కూడళ్లలో వివిధ సేవా సంస్థలు ఏర్పాటుచేసిన చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సదరు చలివేంద్రాల వద్దకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా శానిటరీ కార్యదర్శులకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. చలివేంద్రాలకు అవసరమైతే పురపాలక సంఘం నుంచి తాగునీరు సరఫరా చేస్తామని, అందుకు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీరు లేదా, మున్సిపల్ కమిషనర్‌కు తెలియస్తే వెంటనే నీరు సరఫరా చేస్తామని తెలిపారు. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో సేవా సంస్థల వారు చలివేంద్రాలను పనిచేసే వేళలను సాయంత్రానికి పెంచాలని కోరారు. పట్టణంలోని అన్ని వ్యాపార సంస్థల వారు తమ షాపుల వద్ద ప్రజలు అందుబాటులో తాగునీరు ఉంచి పురపాలక సంఘానికి సహకరించాలని తెలిపారు.

తాగునీటి సమస్య ఉంటే సమాచారం ఇవ్వండి

మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీరు సక్రమంగా అందని ప్రాంతాల వారు ఆయా సచివాలయాల ఎమినిటీస్ కార్యదర్శులకు తెలియజేయాలని కమిషనర్ సూచించారు. వెంటనే మున్సిపాలిటీ నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కాల్ సెంటర్లు

పురపాలక సంఘంలో తాగునీటి సమస్య సత్వర పరిష్కారానికి కాల్ సెంటర్లను ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. వారి ఫోన్ నెంబర్లను చెప్పారు. కె.వెంకటేశ్వరరావు 9949932038, ఏఈ హనుమంతరావు 9849906575,డీఈఈ శివకోటేశ్వరరావు 9849907979, మున్సిపల్ కమిషనర్ 9849905823 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

కుమ్మరి వాగు డొంక రోడ్డు అభివృద్ధి

- రూ. రెండు లక్షలతో పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



డొంక రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని కాండ్రపాడులో మండల పరిషత్ నిధులు రూ. రెండు లక్షలతో చేపట్టిన కుమ్మరి వాగు డొంక రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ కాండ్రపాడు కోనాయపాలెం గ్రామాల మధ్య ఉన్న కుమ్మరి వాగు డొంక రోడ్డు ధ్వంసమవడంతో పంట పొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకునేందుకు డొంక రోడ్డును పరిశీలించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వ పాలన సాగుతోందని జగన్‌మోహనరావు కొనియాడారు. త్వరలోనే రోడ్డు అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు కొండా కృష్ణారెడ్డి, గుగులోతు లక్ష్మి, కమతం నర్సిరెడ్డి, వైఎస్ఎస్ ప్రసాద్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధిత కుటుంబాలను ఆదరిద్దాం



కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న అంకిత సభ్యులు

గుడివాడ టౌన్: ఎయిడ్స్‌తో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదరించడం సమాజసేవగా భావించాలని అంకిత ప్రాజెక్ట్ మేనేజర్ టి. అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఇంటర్నేషనల్ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా అంకిత ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిస్తూ భరోసా కల్పించేలా ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎయిడ్స్ బాధితుల మృతుల కుటుంబ సభ్యుల పట్ల ప్రేమ, సంఘీభావం విస్తరిద్దాం.. అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అంకిత ప్రెసిడెంట్ జి. బేబి సరోజిని, ఐసీటీసీ కన్వీనర్ పి.కిషోర్, అంకిత సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాశ్వతంగా ఫ్లెక్సీల ఏర్పాటు పనులకు అనుమతి లేదు



ఫ్లెక్సీల ఏర్పాటుకు పాతిన ఇనుప స్తంభాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ నాగిరెడ్డి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ ప్రధాన సెంటర్‌లో అనుమతులు లేకుండా ఫ్లెక్సీల ఏర్పాటుకు చేస్తున్న శాశ్వత పనులను ఈవోపీఆర్డీ ఎం.నాగిరెడ్డి ఆదివారం అడ్డుకున్నారు. ఇనుము, సిమెంట్‌తో కలిపి పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నట్లు వచ్చిన సమచారం మేరకు ఈవోపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పనులను నిలిపివేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ప్రధాన సెంటర్‌లో ఇనుప స్తంభాలు పాతి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తుండగా పనులను ఆపేశారు. గ్రామంలో ఫ్లెక్సీలను శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఉండవన్నారు. అలా ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇచ్చి తొలగిస్తామన్నారు.

కొండలమ్మకు పొంగళ్ల సమర్పణ



భక్తులకు మజ్జిగ అందిస్తున్న ఈఓ సురేష్, చైర్మన్ గోపి

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైనులో వచ్చే భక్తులకు మజ్జిగ అందించే కార్యక్రమాన్ని ఆదివారం ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ప్రారంభించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే వేలాది భక్తులకు ఈ కార్యక్రమాన్ని ఏటా వేసవిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పుస్తక పఠనంతో మేధోవికాసం

కంకిపాడు: పుస్తక పఠనంతో మేధోవికాసం సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. వేసవి శిక్షణా కార్యక్రమాలు గ్రంథాలయాల్లో కొనసాగుతున్నాయి. ఆదివారం కంకిపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహించారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయుడు ఎం. మల్లేశ్వరరావు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్, చెస్ పోటీల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణను గ్రంథాలయాధికారి ఎస్. సునీత పర్యవేక్షించారు.


అనాదిగా ఎదురుచూస్తున్న పోర్టుకు పునాది వేస్తూ..
అభివృద్ధి అనే పదానికి నిజమైన అర్థం చెప్తూ
వేలాదిమందికి ఉపాధి అవకాశాన్ని కల్పిస్తూ ..
తన పరిపాలనతో అందరిని మెప్పిస్తూ
మన మధ్యకు విచ్చేస్తున్న ప్రియతమ ముఖ్యమంత్రివర్యులకు
స్వాగతం ఘన స్వాగతం..!
గరికిపాటి శివ